

# ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 28 | జూన్ | 2024 | పేజీలు : 5


## పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు డిప్యూటీ కమాండర్



**భద్రాచలం, జూన్ 27, ప్రజా జ్యోతి**

ఛత్తీస్‌గఢ్, సుక్మా జిల్లా,కిస్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కన్నెమార్క గ్రామానికి చెందిన పి ఎల్ జి ఎ బెటాలియన్ కంపెనీ నం. 02 సప్లై టీమ్ డిప్యూటీ కమాండర్ లేట్ జోగా సుక్మాలోని నక్సల్ ఆప్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ మనీష్ రాత్రే సమక్షంలో నక్సల్ ఆపరేషన్ కార్యాలయం ముందు లొంగిపోయారు. లొంగిపోయిన నక్సలైట్ లేట్ జోగా 5 లక్షల రివార్డ్ కలిగి పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కన్నెమార్క గ్రామ బాల సంఘం నక్సల్ సంస్థలో 2010 నుండి 07 నెలలు,2016 నుండి 2017 వరకు కన్నెమార్క గ్రామ డి ఎ కె ఎం ఎస్ సభ్యుడుగా,డిసెంబర్ 2018 వరకు నక్లర్ మిలిషియాసభ్యుడుగా,2019 నుండి 2020 వరకు

మిగతా 2 లో..

# ఇందిరమ్మ రాజ్యస్థాపనే ధ్యేయం

2 లో




- అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం
- ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలకు కట్టుబడే ఉంది.. ఆగస్టుకు ముందే రుణమాఫీ..
- మిషన్ భగీరధ పేరుతో బిఆర్ఎస్ వేలకోట్లు దండుకుంది...
- రూ.70 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన గత పాలకులు..
- సీతారామ జలాలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం..
- కొత్తగూడెంను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం...
- రూ.128.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన చేసి భట్టి..
- హాజరైన మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, పొంగులేటి

ప్రజా ఆకాంక్షలు, కోర్కెల మేరకు అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రంలో రూ.128.48 కోట్ల అభివృద్ధి పనులకు భట్టి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ పథకంలో భాగంగా రూ.124.48 కోట్ల మంచినీటి పథకం రూ.4 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల పనుల భూమి పూజ పూర్తయ్యిందని, త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో ప్రజలు పెద్ద ఎత్తున దగా పడ్డారని, కానీ ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎంఎల్ఎలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్, డా. తెల్లం వెంకట్రావులతో కలిసి శంకుస్థాపన చేశారు.

■ కొత్తగూడెం, ప్రజాజ్యోతి

## భద్రాచలం ముంపు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన పొంగులేటి



**భద్రాచలం, 27 జూన్, ప్రజాజ్యోతి:**

బడుగు బలహీన వర్గాల ప్రజలు మరియు రైతన్నలు యువత ఆడబిడ్డలు అందర్నీ దృష్టిలో ఉంచుకొని వారికి అన్ని విధాల సహకరించి ప్రభుత్వం తరఫున విడుదలయ్యే అన్ని సంక్షేమ పథకాలు అందించి వారిని అభివృద్ధిలో తీసుకురావడానికి ఇందిరమ్మ ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ పంచాయతీరాజ్ సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం నాడు భద్రాచలంలోని గోదావరి వరదలు ముంపునకు గురి అయ్యే గ్రామాలను వరద తాకిడికి గురికాకుండా నూతనంగా నిర్మిస్తున్న కూనవరం రోడ్డులోని కరకట్ట ప్రదేశాలను ఆయన పరిశీలించారు. గోదావరి వరదల ప్రభావం ఎంత మేరకు వస్తే గ్రామాలు ముంపునకు గురి అవుతాయని సంబంధిత సీఈని అడిగి తెలుసుకుని 33 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న కరకట్ట ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



మిగతా 2 లో..

# పీఆర్సీ బకాయిలు చెల్లించాలని విధుల బహిష్కరణ





**ఇల్లందు, జూన్ 27, ప్రజాజ్యోతి:**

ఇల్లందు మున్సిపల్ కార్మికుల పిఆర్సి, పీఎఫ్ మేడే కానుక పిఎఫ్, బకాయిలు, ఇన్సూరెన్స్ కొనసాగించుట తదితర సమస్యలు గత కొన్ని సంవత్సరాలకు పెండింగ్ ఉన్నాయని, వాటిని పరిష్కారించాలని గురువారం మున్సిపల్ కార్మికులు విధులను బహిష్కరించి, కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియూ అనుబంధ తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, సిఐటియూ జిల్లా నాయకుడు తాళ్లూరి కృష్ణలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రావాల్సిన పిఆర్సి, పిఎఫ్, మేడే కానుక పిఎఫ్, ఇన్సూరెన్స్ కొనసాగించుట వంటి సమస్యలపై అనేక మార్లు మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు ఇచ్చిన సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల పిఆర్సి బకాయిలు, సుమారు రూ. 41. 73 లక్షలు, మేడే కానుక సుమారుగా రూ. 13 లక్షలు, 25 నెలల పిఎఫ్, కార్మికుల వద్ద నుంచి పిఎఫ్ రూపంలో కట్ చేసిన రూ 20. 11 లక్షలు, మున్సిపల్ కాంట్రిబ్యూషన్ రూ. 20. 11 లక్షలతో మొత్తంగా సుమారు రూ. 90 లక్షలు కార్మికులకు బకాయి పడి ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా జులై 1వ తేది వస్తే రెండు నెలల జీతాలు రూ. 30 లక్షల వరకు చిల్లర జీతం చెల్లించాల్సింది ఉందని గుర్తు చేశారు. చిన్న జీతంతో బతికే కార్మికుల పరిస్థితి ఇది పెండింగ్ ఉండడం వలన బడులు ప్రారంభం అయ్యాయని, పిల్లలు ఇంటి వద్ద గోల చేస్తున్నారని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న సైతం యధావిధిగా ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టు ఇల్లందు ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు కూనూరి వీరన్న, సహాయ కారదర్శి వేముల గురునాథం, కార్మికులు నాయిని కృష్ణ భారతి, మహేష్, సదా, కుమార్, చుక్క రామచందర్, వేణు, సంజీవ్, ఉమా, సంధ్య, నందు, ఎల్లబాయి, మోహన్ రావు, బోయపోతుల వెంకటేశ్వర్లు, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

### రూ. 10 నాణేల వినియోగంపై అపోహలు వద్దు... యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ రాజేష్



**అశ్వారావుపేట, జూన్ 27, ప్రజాజ్యోతి:**

రూ. 10 నాణెం చెల్లదంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ రాజేష్ అన్నారు. గురువారం పలు దుకాణాల యజమానులు, వినియోగదారులకు యూనియన్ బ్యాంక్ అశ్వారావుపేట నందు రూ. 10 నాణేలను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో పది రూపాయల నాణెం ఇస్తే తీసుకునేందుకు సామాన్యులు, దుకాణాదారులు వెనకాడుతున్నారని కొందరు కావాలని తప్పుడు ప్రచారాలు చేయడం వల్ల ఇటువంటి పరిస్థితి వచ్చిందన్నారు. రూ. 10 వినియోగంలో ప్రజలు ఎవరూ ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు బ్యాంకు అధికారులు ఇప్పటికే అనేకసార్లు స్పష్టమైన వివరణ ఇచ్చారన్నారు. ఈ విషయంలో దుకాణాదారులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది మురళి , నాగబాబు, శ్రీధర్, పలువురు ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

## జెకె 5 ఓసిలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్



**ఇల్లందు, జూన్ 27, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని జేకే5 ఓసిలో గురువారం డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి. వెంకటేశ్వర రెడ్డి పర్యటించారు. ఓసి పని స్థలాలను సందర్శించి అక్కడ జరుగుచున్న పనులను పరిశీలించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జియం జాన్ ఆనంద్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన డైరెక్టర్ జి. వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని, సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జియం జాన్ ఆనంద్ రాజు, జె.కె ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, మేనేజర్ పూర్ణచందర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చిన్నయ్య, సేఫ్టీ ఆఫీసర్ శివ ప్రసాద్, బ్లాస్టింగ్ అధికారి నాగ రమేష్, సర్వే అధికారులు శ్రీనివాస్, నాగేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి మహేష్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పూర్తిస్థాయిలో ఫ్రీ స్కూల్ విద్యా అందించాలి

### అంగన్వాడీ టీచర్స్ కి శిక్షణ కార్యక్రమం : సిడిపిఓ రోజారాణి



**అశ్వారావుపేట, జూన్27, ప్రజాజ్యోతి:**

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అంగన్వాడి విద్యా విధానంలో కూడా మార్పులు జరిగాయని, చిన్నారులకు పూర్తిస్థాయిలో ప్రీస్కూల్ విద్య అందించాలని సిడిపిఓ రోజా రాణి అన్నారు. ఐసిడిఎస్ కార్యాలయంలో 2వ బ్యాచ్ అంగన్వాడీ టీచర్స్ కు మాస్టర్ ట్రైనర్స్ జె వరలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజా రాణి మాట్లాడుతూ రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆదేశాలతో అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులకు పూర్తిస్థాయిలో ఫ్రీ స్కూల్ విద్యను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బందికి కొత్త సిలబస్ శిక్షణకు సంబంధించిన పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సూపర్వైజర్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సాయినాథుని మందిరాలలో ప్రత్యేక పూజలు

### అభిషేకాలు, అన్నదానాలలో భారీగా పాల్గొన్న భక్తులు



**అశ్వారావుపేట, జూన్ 27, ప్రజాజ్యోతి:**

మండలంలోని షిర్డీసాయి బాబా మందిరాలలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వినాయక పురం గ్రామంలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెంరోడ్డులో ఉన్న శ్రీ జ్ఞానసాయిబాబా మందిరంలో కొలువుదీరిన సాయినాథునికి మందిర అర్చకులు శుభం దీక్షిత్ ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటలకు బాబా మేలుకొలుపుతో ప్రారంభమైన పూజలు 5 గంటల 15 నిమిషాలకు కాకడహారతి 6 గంటలకు బాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. ప్రత్యేకపూజలు, అష్టోత్తరం జరిపి భక్తులకు దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నాహారతి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈఅన్నదాన కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రి 7 గంటలకు పల్లకిసేవచేసి, 8:30గంటలకు బాబాపవళింపు సేవను(శేజ్ హారతి)కొనసాగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిర్డీసాయి సేవ సమితి సభ్యులు పంబి హరిబాబు ,ముళ్ళపూడి సూరిబాబు, విమల శ్రీదేవి, పృధ్వీ,రమాదేవి,స్వప్న,గౌరీ తదితరులు పాల్గొన్నారు.



## నూతన జేకే ఓసి సిఎ స్థల పరిశీలన





**ఇల్లందు, జూన్ 27, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని నూతన ఓసికి సంబంధించిన సిఏ ల్యాండ్ కొరకు మూసివేయబడిన జేకే 2 ఏరియాలోని స్థలాన్ని గురువారం ఖమ్మం జిల్లా అటవీ అధికారులు మంజుల, హరి ప్రసాద్, అయిషా, ఏరియా ఎస్ఓటూ జియం మల్లారపు మల్లయ్యలు పరిశీలించారు. నూతన ఉపరితల గనికి సంబంధించిన సిఏ ల్యాండ్ అటవీ అధికారులకు అప్ప గించటం కోసం అట్టి స్థలాన్ని అటవీ అధికారులకు చూపించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మంగీలాల్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

## వలస ఆదివాసీలపై రాష్ట్రప్రభుత్వం వివక్ష విడాలి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి



**ములకలపల్లి, జూన్ 27, ప్రజాజ్యోతి:** వలస ఆదివాసీలపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష విడాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి అన్నారు. మండలం లోని రాచన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన రాచన్నగుట్ట గ్రామంలో రాచన్నగూడెం మాజీ సర్పంచ్ కొర్సా గణపతి అధ్యక్షతన వలస ఆదివాసీ గ్రామల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వలస ఆదివాసీల ఎడల రాష్ట్ర ప్రభుత్వం వివక్షను విడనాడాలన్నారు. సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు అందించాలన్నారు. వలస ఆదివాసీ గ్రామాలలో మౌలిక వసతులైన రక్షిత మంచినీరు, విద్యుత్, రహదారి సౌకర్యం, విద్యా, వైద్య సదుపాయం, రేషన్ కార్డులు, కులం సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమాయక ఆడివాసీలపై అటవీ శాఖ అధికారుల దాడులు, దౌర్జన్యాలు, పోలిస్ నిర్బంధం ఆపాలన్నారు. వలస ఆదివాసీలకు ఇతర ఆదివాసీ గిరిజనులకు అందినట్లే ప్రభుత్వ సబ్సిడీలు, సౌకర్యాలు, ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు నూపా భాస్కర్, పోతుగంటి లక్ష్మణ్, స్థానిక ఎంపిటీసి మడకం విజయ, మాజీ సర్పంచ్ కొర్సా గణపతి మండల నాయకులు పద్ధం లక్ష్మణరావు, యర్రగొర్ల రామారావు, నకిరకంటి నాగేశ్వరరావు పద్దం వెంకటేష్, పొడియం కిరణ్ కుమార్, సోయం అఖిల్ రమేష్, మడకం రవి, మడకం సంతోష్, మడివి ఆది, పొడియం రాజు,కొవ్వాసి రాజు, మడకం వీరభద్రం, సోడె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు గనుల తవ్వకాల వేలన్ని అడ్డుకోవాలని టి బి జి కె యస్ అధ్వర్యంలో పోరాటాలు..

### ఏరియా టి బి జి కె యస్ నాయకులు నాగెల్లి



**మణుగూరు, జూన్ 27, ప్రజాజ్యోతి:** కేంద్రంలో కొత్తగా ఏర్పాటైన బిజెపి ప్రభుత్వం సింగరేణి లో ఉన్న బొగ్గు గనులను మరో మారు వేలాన్ని వేయడాన్ని నిరసిస్తూ బొగ్గు గనుల వెలన్ని అడ్డుకొని సింగరేణి సంస్థను పరిరక్షించుకుంటాం అనే నినాదంతో తెలం గాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగిందని ఏరియా టి బి జి కె యస్ నాయకులు నాగెల్లి తెలియ చేశారు. గురువారం నాడు హైద్రాబాద్ లోని తెలంగాణ భవన్ లో టి బి జి కె యస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల. రాజిరెడ్డి , ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, సింగరేణి వ్యాప్తంగా ఉన్న టి బి జి కె యస్ నాయకులు హైద్రాబాద్ లోని తెలంగాణ భవన్ నందు సమావేశం లో మణుగూరు ఏరియా టి బి జి కె యస్ నాయకులు నాగెల్లి పాల్గొన్నారు. బొగ్గు గనుల వెలాన్ని అడ్డుకునే విధానంలో బి అర్ యస్ పార్టీ మద్దతు కావాలని వర్కింగ్ ప్రసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుని వారంత స్వయంగా కలసి కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజ నాలు, కార్మిక శ్రేయస్సు,సింగరేణి పరిరక్షణ కోసం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం చేపట్టే ఉద్యమ కార్యాచరణ ప్రణాళికకు బి అర్ యస్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని అయన తెలిపారు. గనుల పై నల్ల బ్యాడ్జిల ధరించి నిరసన మొదలు బొగ్గు బావులను కాపాడుకోవడానికి ప్రత్యక్ష పరోక్ష పోరాటాలకు టి బి జి కె యస్ కార్యాచరణ చేపట్టడం జరిగిందని టి బి జి కె యస్ అంతిమ లక్ష్యం సింగరేణి పరిరక్షణ అని అందు కు ఏరియా కార్మికులు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం చేసే పోరాటా లకు మద్ద తుగా నిలిచి సింగరేణి నీ పరిరక్షణలో భాగస్వామ్యం వహించాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, మీసాల మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల భూములకు రక్షణ కల్పించాలి

### - మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేసిన ఆర్. మధుసూదన్ రెడ్డి



**మణుగూరు రూరల్, జూన్ 27, ప్రజాజ్యోతి:** ఏజెన్సీలోని గిరిజనేతర పేదల భూములకు రక్షణ కల్పించాలని, పట్టాలు రాని గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, వలస ఆదివాసుల పోడు భూములకు పట్టా లు ఇవ్వాలని, వారికి కులం సర్టిఫి కెట్లు ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్( ప్రజాపంథా) మణుగూరు డివి జన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులతో పాటు గిరిజనేతర పేదలు కూడా దశాబ్దాలుగా కలిసిమెలిసి జీవనం సాగిస్తున్నారని, 20 కుంటల నుండి మూడు ఎకరాల వరకు భూములను సాగు చేసుకుంటూ, వాటిపై ఆధారపడి వారి కుటుంబాలను పోషించు కుంటూ జీవనం సాగిస్తున్నారని, గతంలో అట్టి భూములకు ప్రభుత్వం భూమిశి స్తులు కట్టించుకునేదని, రెవెన్యూ రికార్డులలో కూడా వారి భూమి ఉండేదని, వారికి పహాని నకలు కూడా ఇచ్చేవారని, దానితో సహకార సంఘాలలో పంట రుణాలు కూడా తీసుకునే వారని, దాంతో వారి భూములకు కొంత భద్రతగా ఉండి ప్రశాంతంగా జీవించేవారని అన్నారు. ప్రభుత్వం వారికి భూమిశిస్తులు రద్దు చేయడం వలన వారి భూములకు ఎలాంటి ఆధారం లేక ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం వారి భూములకు భూమిశిస్తులు కట్టించుకొని వారి భూములకు భరోసా కల్పించాలన్నారు. పట్టాలు రాని గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. వలస ఆదివాసీల పోడు భూములకు కూడా పట్టాలు ఇవ్వాలని, కుల సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కార్మికుల హై పవర్ కమిటీ వేతనాల అమలుకు ప్రభుత్వం స్పందించాలి





**మణుగూరు, జూన్ 27, ప్రజాజ్యోతి:** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సింగరేణి కార్మికుల కారుణ్య నియామకాలలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ న్యాయం చేయాలని మణుగూరులో కొత్త బొగ్గు గల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రెవెన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి, మరియు సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు కి వినతి పత్రం అందజేశారు, గురువారం నాడు మంత్రి పొంగులేటి మణుగూరు పర్యటన నేపథ్యంలో సింగరేణి ఇల్లందు గెస్ట్ హౌస్ లో, మంత్రిని సిపిఐ శాసనసభ పక్ష నేతను కలిసి వినతి పత్రం అందజేయటంతో పాటు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జీవన స్థితిగతులపై, సింగరేణి కారుణ్య నియామకాలు మణుగూరు మనుగడ పై నాయకులకు వివరించినట్లు గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ డి నాసర్ పాషా మాట్లాడుతూ గత 11 ఏళ్ల క్రితం హై పవర్ కమిటీ సిఫారసు చేసినప్పటికీ ఇన్ని ఏండ్లుగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు కావడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ జీవితాలు బాగుపడతాయని సింగరేణి కాంటాక్ట్ కార్మికులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. దీంతోపాటు సింగరేణి కార్మికుల కారుణ్య నియామకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారందరికీ న్యాయం జరిగే దిశగా పాలసీని మార్చాలని మణుగూరు లో కొన్ని బొగ్గు గనులు మూతపడనున్న నేపథ్యంలో కొత్త గనుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, సింగరేణిలో అంతర్గత ప్రైవేటీకరణ నిలిపివేయాలని ఆయన కోరారు. సింగరేణి భూ నిర్వాసితులకు స్థానికులకు సివిల్ మరియు ఓబి కంపెనీలలో 80% ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు మణుగూరు ఏరియా అధ్యక్షులు ఏ మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు యు శివరామకృష్ణ, కే గురుమూర్తి, జి నాగేశ్వరరావు,ప్రసాద్, కట్ట మహేష్, కే శ్రీనివాస్,ఐ గోపి, పాల్గొన్నారు.

## నిరుపేదలకు అపన్న హస్తం అందిస్తున్న ఇడుపుల రాజు



**జూలూరుపాడు, జూన్, 27 ప్రజాజ్యోతి** జూలూరుపాడు మండల కేంద్రంలో లోని ఎలబాక అనసూయమ్మ ఉంటానికి ఇల్లు కూడా సరిగా లేని పరిస్థితిలో ఒక పూట తిని తినక కాలం వెలదీస్తున్న నిరుపేద ఆమెకు పూట గడవడం కష్టంగా ఉన్న సమయంలో మేమున్నా మంటూ జిపిఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు ఆ నిరుపేద రాలికి ఇంటిపై కప్పుకోవడానికి పట్టాను (పరాద ) మరియు నిత్యవసర సరుకులను జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ, తమ స్వార్థం కోసం ఒకరినొకరు దోచుకుని తినే ఈ రోజుల్లో, ఇడుపుల రాజు అనే యువకుడు జె పి ఆర్ ట్రస్టును స్థాపించి నిరుపేదలకు తన అపన్న హస్తానంది స్తున్నాడు. నిరుపేదలకు నిత్యవసర సరుకులు అందిస్తూ, పాఠశాల పిల్లలకు పెన్నులు పుస్తకాలు అందిస్తూ, పలు సేవా కార్యక్రమాలను చేస్తూ నలుగురు శభాష్ అనిపించుకుంటున్నాడు. రాజు అనే ఈ యువకుడు మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తూ మంచి హృదయంతో ముందుకు సాగాలని అన్నారు. చిన్న వయసులోనే జెపిఆర్ ట్రస్ట్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఇడుపుల రాజును ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తంబర్ల నరసింహారావు, సమీర్, ఇడుపుల రాజుపాల్గొన్నారు.

## జాకారం లో ఎంసీహెచ్ మొబైల్ టీం హెల్త్ క్యాంప్




**ఆళ్లపల్లి, జూన్ 27, ప్రజాజ్యోతి:** మండలంలోని జాకారం గ్రామంలో ఈరోజు ఎం సి హెచ్ మొబైల్ టీం నిర్వహించారు మందులు ఇవ్వడంతో పాటు .గర్భిణీ స్త్రీలకు, అనారోగ్యంతో ఉన్న ప్రజలకు జాకారం పాఠశాలలో ఉన్న విద్యార్థుల ఆరోగ్య దృశ్య ఎత్తు , బరువు చూసి వారికి తగిన ఆరోగ్య సలహాలను ఇవ్వడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమూద్ పాష తెలియజేశారు. ఈ మొబైల్ టీం ఐటిడిఏ పరిధిలో పనిచేస్తుందని నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా వీరి నియామకం జరుగుతుందని ఎం సి హెచ్ మొబైల్ టీం డాక్టర్ కార్తీక్ , నర్స్ సరిత ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభావితం కాకుండా ఉండేందుకు ఇలాంటి హెల్త్ క్యాంపులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని హెచ్ఎం పాషా తెలియజేశారు పాఠశాలను. గ్రామం మొబైల్ టీంకు ,ఐటిడిఏ వారి సందర్శించిన ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కృతజ్ఞతలు తెలియజేశారు.

